సాక్షి
అనంతపురం

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.21,850

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,850 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/10.9°

జిల్లా అంతటా బుధవారం చలి వాతావరణం కొనసాగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో బీటెక్ ఫలితాలు విడుదలయ్యాయి. నాలుగో సంవత్సరం మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ, రెగ్యులర్ (ఆర్–20), రెండో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలను బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాజు, డాక్టర్ అంకారావు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 'చలిగింతలు'.. మధ్యాహ్నం 'సెగలు',

- ఉమ్మడి జిల్లాలో భిన్నమైన వాతావరణం

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఎండలు సుర్రుమనిపిస్తుండగా... వేకువజామున చలిగింతలు ఉంటున్నాయి. చాలా మండలాల్లో రాత్రిళ్లు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల మధ్య రికార్డవుతున్నా.. రాత్రిళ్లు, వేకువజామున మాత్రం కనిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి. చాలా మండలాల్లో వేకువజామున 9 నుంచి 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు రోజులుగా పగటి పూట గాలి వేగం స్వల్పంగా పెరగడంతో ఎండ తీవ్రత తగ్గుముఖం పట్టింది. పామిడి, తాడిపత్రి, అనంతపురం, కూడేరు, గుంతకల్లు, తలుపుల, చెన్నేకొత్తపల్లి, కొత్తచెరువు తదితర మండలాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 36 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. కుందుర్పి, శెట్టూరు, కళ్యాణదుర్గం, కంబదూరు, రాప్తాడు, మడకశిర,గుడిబండ, తనకల్లు, సోమందేపల్లి తదితర మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు ఇంకా 10 నుంచి 12 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఈనెలాఖరు వరకు వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మార్చి నుంచి ఎండతీవ్రత 40 డిగ్రీలు, ఆపైన కూడా పెరిగే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి కన్నుమూత



షేక్ సాహెబ్ (ఫైల్)

గుత్తి: పట్టణంలోని కోటవీధిలో నివాసం ఉంటున్న శతాధిక వృద్ధుడు షేక్ సాహెబ్ (103) మంగళవారం రాత్రి కన్నుమూశారు. షేక్ సాహెబ్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఈయన భార్య చాలా ఏళ్ల క్రితమే మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. మనవళ్లు, మనవరాళ్లు మొత్తం 35 మంది ఉన్నారు. షేక్‌సాహెబ్ మృతిపై ముస్లిం, దూదేకుల సంఘాల నాయకులతో పాటు గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ సంతాపం ప్రకటించారు.

గోవిందా.. గోవింద

- అంగరంగ వైభవం.. కొండమీదరాయుని రథోత్సవం
- పులకించిన భక్తజనం
- కిటకిటలాడిన బుక్కరాయసముద్రం

ఎటు చూసినా భక్తులే... ప్రతి నోటా గోవిందనామ స్మరణే.. మదినిండా భక్తిభావమే.. కొండమీదరాయుని రథోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బుక్కరాయసముద్రం ఆధ్యాత్మిక సాగరంలో మునిగితేలింది. భక్తుల జయ జయధ్వానాలు మిన్నంటాయి.





ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు, స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

బుక్కరాయసముద్రం: కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండల వేంకటేశ్వరస్వామి బుక్కరాయసముద్రం సమీపంలోని దేవరకొండపై కొండమీదరాయునిగా అవతరించి భక్తుల కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్నాడు. 10 రోజులుగా స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రోజుకో వాహనంపై శ్రీవారు ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే బుధవారం నిర్వహించిన రథోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తజనంతో పురవీధులు కిటకిటలాడాయి.

కల్యాణం.. కమనీయం

మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజాము 4 గంటలకు శ్రీదేవి,భూదేవితో శ్రీవారి కల్యాణ మహోత్సవం జరిపించారు. 11.30 గంటలకు స్వామివారిని సతీసమేతంగా సూర్య ప్రభ వాహనంపై వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చి ఆశీనులను గావించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి తదితరులు రథం వద్ద పూజలు చేశారు. వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సరిగ్గా 12 గంటలకు రథోత్సవం ప్రారంభమైంది.

మదినిండా గోవిందుడే..

రథంలో రాజసం ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్న శ్రీవారిని చూసి భక్తులు తన్మయత్వం పొందారు. కనులారా దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో బీకేఎస్ పులకించింది. రథోత్సవానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గుమ్మడికాయలు, టెంకాయలు రథం వద్ద కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దేవర కొండపైకి వెళ్లి కొండమీద రాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ బందోబస్తు..

కొండమీద రాయుని రథోత్సవంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. రథం చుట్టూ స్పెషల్ పార్టీ సిబ్బందిని మోహరించారు. సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించారు. తిరునాలకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ, దాతల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



అశేష భక్తజనం నడుమ సాగుతున్న కొండమీదరాయుడి రథోత్సవం

భయమేస్తోంది బంగారం..

పెళ్లింట.. 'పసిడి' మంట!

- రోజురోజుకూ ఎగిసిపడుతున్న ధరలు
- వివాహాలకు సిద్ధమవుతున్న కుటుంబాల్లో అలజడి
- మధ్యతరగతి కుటుంబాలు ఐదారు తులాలు కూడా కొనలేని పరిస్థితి
- చిన్న స్వర్ణకారుల వ్యాపారాలు డీలా
- ఈ నెలాఖరులోపు ఉమ్మడి జిల్లాలో 4 వేల వివాహాలు!



ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిన్న బంగారు షాపులు
400 వరకు

షాపులను నమ్ముకుని పనిచేస్తున్న స్వర్ణకారులు
1,200 పైనే

ఉమ్మడి జిల్లాలో బ్రాండెడ్ బంగారు నగల షాపులు
15 వరకూ

ఏటా మాఘమాసంలో జరిగే వివాహాలు
4,000 వరకూ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మాఘమాసం అంటేనే పెళ్లిళ్ల సీజన్. వివాహం కోసం ఎప్పటి నుంచో వేచిచూసిన యువతీ యువకులు ఇప్పుడు ఒక్కటవుతారు. ఈనెలలో సుమారు 15 రోజుల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయి. తాజా అంచనాల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫిబ్రవరి 28 లోపు సుమారు 4 వేల పెళ్లిళ్లు జరగనున్నాయి.

బంగారం.. భయం

పెళ్లి జరగాలంటే కాసింత బంగారు ఉండాల్సిందేనన్నది తెలుగువారి సెంటిమెంటు. కొత్తబట్టలు, పట్టుచీరలతో పాటు కచ్చితంగా బంగారం కొనాల్సిందేనంటారు. ఈ క్రమంలో పెరుగుతున్న పసిడి ధరలు పెళ్లివారిలో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. అసలే పెళ్లి సంబంధాలు కుదరక ఆలస్యంగానైనా చేసుకుంటున్నాం కదా అనుకునే వేలాది జంటలు పసిడి ధరల తాకిడికి నీరస పడిపోతున్నాయి. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం (ఆర్నమెంట్) రూ. 80 వేలకు చేరిన నేపథ్యంలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా ఇదే చర్చ సాగుతోంది. ఒక పెళ్లికి కనిష్టంగా పది తులాలు బంగారం ఉండాలి. అంటే ఒక్క బంగారానికే ఖర్చు రూ.10 లక్షలు అవుతుంది. వివాహానికి మరో రూ.10 లక్షలు వెరసి రూ.20 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. దీంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

క్యాష్ వద్దు.. బంగారమే ముద్దు

గతంలో వరకట్నం గురించి డబ్బు పరంగా మాట్లాడుకునేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. తమకు డబ్బు అవసరం లేదు బంగారం పెట్టుకోండి అని చెప్పేస్తున్నారు. దీంతో వధువు తల్లిదండ్రులు బంగారు ఆభరణాలపై మక్కువ చూపిస్తున్నారు. కష్టమైనా ఎలాగోలా రూ. లక్షలు సర్దుతున్నారు.

ధర చూస్తేనే భయమేస్తోంది



మన సంప్రదాయం ప్రకారం బంగారం అంటే సెంటిమెంటు. బంగారం ఇష్టపడని ఆడవాళ్లంటూ ఉండరు. బంగారు ఇంట్లో ఉంటే ఆపత్కాలంలోనూ అండగా ఉంటుంది. అయితే, రోజురోజుకూ పసిడి ధర పెరిగిపోతుండటంతో భయమేస్తోంది. తులం బంగారం కొనాలన్నా లక్ష రూపాయలు ఖర్చవుతోంది.
–పద్మజ, అనంతపురం

చిరు వ్యాపారులకు చాలా ఇబ్బంది



ఉమ్మడి జిల్లాలో చిన్న చిన్న బంగారం పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే వాళ్లు వేల మంది ఉన్నారు. ధరలు ఆకాశాన్నంటుతుండటంతో గిరాకీలు లేవు. దీంతో వందల మంది చిన్న వ్యాపారులు షాపులు మూసుకునే పరిస్థితి వచ్చింది. ధర తగ్గితే కానీ పదిమంది కొనే పరిస్థితి లేదు.
– బ్రహ్మాచారి, స్వర్ణకారుడు, అనంతపురం

వ్యాపారాలు స్తంభించాయి



బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో వ్యాపారాలు స్తంభించాయి. మధ్య తరగతి ప్రజలు బంగారం కొనడానికి రావడం లేదు.వివాహాలు జరిగే సమయంలో కొద్దో గొప్పో కొనడం తప్ప గతంలోలాగా వ్యాపారాలు లేవు. బ్రాండెడ్ షాపుల ప్రభావం చిన్న వ్యాపారుల మీద తీవ్రంగా పడింది.
– సూర్యప్రకాష్, స్వర్ణకారుడు

ప్రాక్టికల్స్‌కు 238 మంది గైర్హాజరు



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ మలోల, ఇంటర్ బోర్డ్ ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షలకు 238 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 56 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ విద్యార్థులు 2,546 మందికి గాను 2,507 మంది హాజరయ్యారు. 39 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,286 మందికి గాను 1,154 మంది హాజరయ్యారు. 132 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం కూడా 56 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ విద్యార్థులు 2,464 మందికి గాను 2,428 మంది హాజరయ్యారు. 36 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 960 మందికి గాను 929 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణనాయక్ 5 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 9 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 10 కేంద్రాలను తనిఖీలు చేశారు.

స్ట్రాంగ్‌రూంలను పరిశీలించిన డీఆర్‌ఓ

మార్చి 1 నుంచి జరగబోయే ఇంటర్ థియరీ పరీక్షలకు సంబంధించి అనంతపురం కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రశ్నపత్రాల స్ట్రాంగ్ రూంలను బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి మలోల పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్‌కు సూచనలిచ్చారు. డీఆర్‌ఓ వెంట తహసీల్దారు హరి ప్రసాద్ ఉన్నారు.

ఉద్యాన పంటల విస్తీర్ణం పెరగాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: జిల్లా వాతావరణం, నేల స్వభావం ఉద్యాన పంటల సాగుకు అనుకూలమని, రైతులను ఆ దిశగా ప్రోత్సహించి ఆయా పంటల సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అధిక దిగుబడి, ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిందు సేద్యం పరికరాలు ఎక్కువ విస్తీర్ణంలో అందించేలా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా కనీస మద్దతు ధరతో కందులు కొనుగోలు చేయాలన్నారు. జొన్న, పప్పుశనగ, వేరుశనగ పంటను కూడా కనీస మద్దతు ధరతో కొనుగోలుకు అనుమతి తీసుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ఫలితాలను తెలియజేసే సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు అందజేయడంతో పాటు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కౌలు రైతులను గుర్తించి హక్కు ప్రతం అందించాలని, ప్రభుత్వ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాడి రైతులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం ఉద్యాన శాఖ 2025 డైరీ, ప్లాంట్ డాక్టర్స్ డైరీ 2025, ఏపీ అగ్రికల్చర్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, డీసీఓ అరుణకుమారి, మార్క్‌ఫెడ్ ఏడీ పెన్నేశ్వరి, ఆత్మా పీడీ మద్దిలేటి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో ఈ నెల 14న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న 'విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేసే కార్యక్రమాని'కి పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం గార్లదిన్నె మోడల్ స్కూల్‌ను కలెక్టర్ వినోద్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నోడల్ అధికారిగా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న వ్యవహరిస్తారన్నారు. పాఠశాలలో స్టేజీ ఏర్పాటుకు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈతో సమన్వయం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఈబీదేవికి సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్ బాబు, తహసీల్దార్ ఈరమ్మ, ఎంఈఓ చంద్రానాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేస్తాం

- మరోమారు వైఎస్ జగన్‌ను సీఎం చేసుకుంటాం
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్ రాకను స్వాగతిస్తున్నాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి





మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో శైలజానాథ్, రంగయ్య, ఆలూరు, వీరా,తదితరులు, వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణుల సందడి

అనంతపురం కార్పొరేషన్: 'అలివిగాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. సూపర్ సిక్స్ హామీలను విస్మరించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దౌర్జన్యాలు, అక్రమాలు చేస్తోంది. ఎల్లో మీడియాను అడ్డంపెట్టుకుని ప్రశ్నించే గొంతుకను అణచివేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పార్టీని మరింత బలోపేతం చేసి మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందాం' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరిన విషయం విదితమే. ఈ క్రమంలో బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య, ప్రభుత్వ విద్య మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలసి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామి రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీలోకి సాకే శైలజానాథ్ రాకను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని నమ్మి ఆయన పార్టీలో చేరారన్నారు. ఇంకా యువకులు, ఉత్సాహవంతులు పార్టీలోకి వస్తారన్నారు. ప్రజా సంక్షేమం విస్మరించి అరాచక పాలన చేస్తున్న 'కూటమి' పెద్దల మెడలు వంచడానికి పెద్ద ఎత్తున పోరాటాలు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామన్నారు. 2014లోనూ స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ ఎత్తును తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు.

కూటమిని ఎదుర్కొనే వ్యక్తి జగనే..

మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ సత్యదూరమైన హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు ప్రజలను అష్టకష్టాలకు గురి చేస్తున్నారన్నారు. ఎన్‌డీఏ ఆర్థిక, రాజకీయ, సామాజిక విధానాలను ఎదుర్కోగలిగిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రజల సంక్షేమం కోసమే రాజకీయాలుండాలి కానీ, ప్రతీకారాల కోసం కాదన్న విషయాన్ని అధికార పక్షం గుర్తు పెట్టుకోవాలన్నారు. సూపర్ సిక్స్ హామీలపై సీఎం చంద్రబాబు మాట తప్పారన్నారు. రూ.12 లక్షల కోట్ల అప్పులు చేశారంటూ ఎన్నికలకు ముందు తప్పుదోవ పట్టించిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక అప్పులు రూ.6 లక్షలు మాత్రమే అని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీల అమలుకు బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వంపై పోరాటానికి తాము సిద్ధమన్నారు. ప్రభుత్వ విద్యా మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. హామీల అమలులో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు చిత్తశుద్ధి లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకునేందుకు కృషి చేస్తామని, టీడీపీ అరాచకాలపై నిత్యం పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థులకు వణుకు పుట్టించిన బడి బస్సు



ఆందోళన పడుతున్న ఇంటర్ విద్యార్థులు

ఉరవకొండ: ప్రాక్టికల్స్ పరీక్షకు హాజరయ్యేందుకు బయలుదేరిన ఇంటర్ విద్యార్థుల వెన్నులో ఆర్టీసీ బస్సు వణుకు పుట్టించింది. విడపనకల్లు మండలంలోని పాల్తూరు, హావళిగి, కరకముక్కల గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉరవకొండలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. రోజూ బడి బస్సులో వీరు ఉరవకొండకు వచ్చి వెళుతుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రాక్టికల్ పరీక్షకు సదరు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. ఆయా గ్రామాలను చుట్టి ఇంటర్ విద్యార్థులను ఎక్కించుకున్న బడి బస్సు హావళిగి వద్దకు చేరుకోగానే మొరాయించింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉండగా మరో 20 నిమిషాల వ్యవధి ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. కొందరు విద్యార్థులు కంట తడి పెట్టారు. పరిస్థితి గమనించిన డ్రైవర్, కండెక్టర్ వెంటనే డీఎంతో మాట్లాడి మరో బస్సు తెప్పించి ఆఖరు క్షణంలో విద్యార్థులను పరీక్ష కేంద్రానికి చేర్చారు. కాగా, విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కండీషన్ లేని బస్సులను పరీక్షల సమయంలో పంపడాన్ని ఆక్షేపించారు.

తలారిచెరువు ఖాళీ

పూర్వీకుల ఆచారాన్ని గౌరవిస్తూ గ్రామాన్ని వీడిన స్థానికులు



పశువులను తోలుకెళుతున్న రైతు

తాడిపత్రి రూరల్: మండలంలోని తలారిచెరువు గ్రామం బుధవారం నిర్మానుష్యమైంది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అగ్గిపాడు పేరుతో ఏటా గ్రామాన్ని ఖాళీ చేయడం దాదాపు 400 సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు. పిల్లాపాపలు, వయో వృద్ధులతో పాటు పశువులు, మేకలు తదితర వాటిని కూడా తమ వెంట తోలుకుని వెళ్లారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన హాజీవలి దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా అవరణలో చెట్ల కింద వంటలు చేసి విందు భోజనాలు ఆరగించారు. గ్రామం ఖాళీ కావడంతో ఇళ్లు, గుడి, బడి, పీర్ల చావడికి తాళాలు పడ్డాయి. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వెళ్లకుండా చుట్టూ ముళ్ల కంచె వేయడంతో పాటు కొందరు యువకులను కాపలాకు ఉంచారు.





దేవాలయం, ఇళ్లకు వేసిన తాళం



దర్గా ఆవరణలో వంటలు చేస్తున్న మహిళలు

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు ఎంపిక



పీడీ శ్రీనివాసులు

విడపనకల్లు: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో విడపనకల్లు మండలం పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) శ్రీనివాసులు చోటు దక్కింది. గత ఏడాది నవంబర్‌లో విజయవాడలో క్రీడాకారుల ఎంపిక చేపట్టారు. ఆ సమయంలో శ్రీనివాసులు తనదైన శైలిలో ఆటతీరు ప్రదర్శించి జట్టులో స్థానాన్ని పదిలం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులను హెచ్‌ఎం సర్వమంగళ, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి దుర్మరణం

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బళ్లారి జిల్లా బండట్టి గ్రామానికి చెందిన వినోద్, ఉమేష్ బుధవారం రాత్రి రాయదుర్గం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. డి.హీరేహాళ్ హోసగుడ్డం గ్రామ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటో ముందర టైర్ పంచర్ కావడంతో ఆటో అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరూ అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో వినోద్ (30) తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బయటపడిన ఉమేష్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, వినోద్‌కు రెండేళ్ల క్రితం గుమ్మఘట్ట మండలం బానుపల్లి గ్రామానికి చెందిన జ్ఞానేశ్వరితో వివాహమైంది. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. జ్ఞానేశ్వరి ప్రస్తుతం గర్భిణిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య



మృతుడు రాజు

కణేకల్లు: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం గంగలాపురం గ్రామానికి రైతు హరిజన రాజు (35)కు భార్య రామలక్ష్మి, ఐదేళ్ల లోపు వయసున్న ఇద్దరు కుమారులు, ఆరు నెలల వయసున్న ఓ కుమార్తె ఉన్నారు. తన నాన్న కపలప్ప గారి మారెప్ప పేరున ఉన్న అర ఎకరా ఆయకట్టు భూమిని సాగు చేస్తూ మరో ఆరున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. పంటల సాగు కోసం రూ.8 లక్షల వరకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలో ఆశించిన మేర దిగుబడి రాలేదు. దీనికి తోడు మార్కెట్లో గిట్టుబాటు ధర లేక పోవడంతో తక్కువ ధరకే వరి ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వచ్చింది. ఇటీవల తమ అప్పు తీర్చాలంటూ తరచూ వడ్డీ వ్యాపారులు గొడవ పడుతుండడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన రాజు మంగళవారం రాత్రి పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి 10 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు పొలానికెళ్లి పరిశీలించారు. చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న రాజును గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అధినేతను కలిసిన 'తోపుదుర్తి' బ్రదర్స్



రాప్తాడు రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వారివెంట వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ నాయకుడు పేరూరు నాగిరెడ్డి, అనంతపురం రూరల్ మండల కన్వీనర్ బండి పవన్, ఆత్మకూరు మండల కన్వీనర్ బాలపోతన్న ఉన్నారు.

జీతాలివ్వకుంటే ఎలా బతకాలి?

- ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు ఉద్యోగుల బహిరంగ లేఖ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బోధన, బోధనేతర ఉద్యోగులు, పెన్షనర్లకు జీతభత్యాల చెల్లింపు అంశంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ఉద్యోగ సంఘాలు ప్రశ్నించాయి. ఈ మేరకు ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు బోధనేతర సంఘం నాయకుడు రఘోత్తం రెడ్డి బహిరంగ లేఖ రాశారు. జీతాలు అందేలా చూడాల్సిన కనీస బాధ్యత రిజిస్ట్రార్‌పై ఉంటుందన్నారు. ప్రభుత్వానికి బడ్జెట్ పంపితే ఇప్పటికే రెండు సార్లు వెనక్కి వచ్చిందన్నారు. ఉన్నత విద్యాశాఖ, ఆర్థిక శాఖకు నచ్చచెప్పి ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించడంలో రిజిస్ట్రార్ నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రతి నెలా ఏదో ఒక సాకు చెప్పి జీతాలు ఆలస్యం ఇస్తున్నారని విమర్శించారు. మూడు నెలలకోసారి బడ్జెట్ వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి పంపాల్సి ఉందని, అయితే, వివరాలు సక్రమంగా పంపకపోవడంతో ఇప్పటికే రెండు సార్లు వెనక్కి పంపారన్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి గ్రాంట్ మంజూరు కాలేదన్నారు. గత నెల జీతం కూడా రాలేదని, ఫిబ్రవరిలో కూడా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. గృహాలకు సంబంధించిన రుణాలు, వాహనాల నెలవారీ కంతులు చెల్లించేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న గ్రాంట్ నుంచి ఉద్యోగులకు జీతాలు చెల్లించే అవకాశం ఉన్నా.. ఇన్‌చార్జ్ వీసీ, రిజిస్ట్రార్‌లు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోకుంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. కాగా, ఓ గ్రేడ్-1 అధికారి నేరుగా వర్సిటీ ఉన్నతాధికారులకు బహిరంగ లేఖ రాయడంతో కలకలం చెలరేగింది. ఉద్యోగులందరూ లేఖలో ప్రస్తావించిన అంశాలను సమర్థిస్తున్నారు. ఈ క్రమంలో నేరుగా వీసీ, రిజిస్ట్రార్‌లకు వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

వజ్రకరూరు: జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి గాను విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ హోదాలో వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జోనాథన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతి (రెగ్యులర్), 6, 7, 8, 9వ తరగతులలో బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాలు చేపట్టనున్నారు. అర్హులైన బాలబాలికలు దరఖాస్తులను ఈ నెల 15 నుంచి మార్చి 13వ తేదీలోపు https://mjpapbcwreis.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 27న, 6, 7, 8, 9 తరగతుల ప్రవేశార్థులకు ఏప్రిల్ 28న, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 20 ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చాటిన వారికి ప్రవేశాలు కల్పిస్తారు.

రీసర్వే పారదర్శకంగా సాగాలి : జేసీ

పామిడి/గార్లదిన్నె: పామిడి మండలం కాలాపురం, గార్లదిన్నె మండలం కల్లూరు చేపట్టిన రీ సర్వేను జేసీ శివ్‌నారాయణ శర్మ బుధవారం పరిశీలించారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా సాగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ, బ్లాక్, ప్రభుత్వ సరిహద్దులను పక్కాగా నిర్ధారించాలన్నారు. గ్రామ ప్రజల సమక్షంలోనే సర్వే చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట తహసీల్దార్లు ఎస్ శ్రీధరమూర్తి, ఈరమ్మ, రీసర్వే డీటీ విజయ్, సర్వేయర్ శ్యామల, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాటే మంత్రం.. డీలర్లపై కుతంత్రం

- ప్రభుత్వం తమదేనన్న అహంతో చెలరేగిపోతున్న టీడీపీ నేతలు
- రేషన్ డీలర్లపై నానాటికీ పెరిగిపోతున్న రాజకీయ వేధింపులు
- ఇప్పటికే రాయదుర్గంలో 37 స్టోర్లకు గాను 28 కూటమి నేతలకు అప్పగింత



రోదిస్తున్న మహిళా డీలరు వన్నూరుమ్మ

రాయదుర్గం టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం మాదే అనే అహంతో టీడీపీ నేతలు సాగిస్తున్న దౌర్జన్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వారి మాటను మంత్రంగా భావిస్తూ అధికారులు సైతం జీహుజూరంటూ సాగిలపడుతుండడంతో సామాన్యులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటి వరకూ అంగన్‌వాడీలు, ఎండీఎంలు, ఉపాధి క్షేత్ర సహాయకులు ఇతర చిరుద్యోగులను అక్రమంగా తొలగించేలా పావులు కదిపిన టీడీపీ నేతలు తాజాగా, స్టోరుడీలర్లపై పడ్డారు.

తొలగింపులే ప్రధానంగా

రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా స్టోరు డీలర్లపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు తారాస్థాయికి చేరుకున్నాయి. టీడీపీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి ఎంతో కాలంగా కొనసాగుతున్న డీలర్లను తొలగించి తమకు అనుకూలమైన వారికి కట్టబెట్టడమే పనిగా టీడీపీ నేతలు కుట్రలకు తెరలేపారు. రాయదుర్గం రూరల్, పట్టణ పరిధిలో మొత్తం 37 చౌక ధాన్యపు డిపోలు ఉండగా ఇప్పటికే దాదాపు 28 డిపోలను డ్వాక్రా గ్రూపుల పేరుతో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అధికారులు కట్టబెట్టారు. 'మా పార్టీ అధికారంలో ఉంది, స్టోర్లన్నీ మాకే కావాలి' అంటూ అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తీసుకెళ్లి మరీ డీలర్‌షిప్పును కైవసం చేసుకుంటున్నారు. రాజకీయ వేధింపులు తాళలేక కొందరు స్వచ్ఛందంగా వదులుకోగా, మరికొందరిపై 6ఏ కేసులను అక్రమంగా నమోదు చేసి తొలగించారు. దీంతో పట్టణంలో ఇద్దరు డీలర్లు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజాగా పట్టణంలోని మరో రెండు స్టోర్లపై కన్నేసిన టీడీపీ నేతలు తరుచూ తనిఖీల పేరుతో రెవెన్యూ అధికారులను ఉసిగొల్పారు.

కన్నీంటి పర్యంతమైన మహిళా డీలరు

బుధవారం ఉదయం రాయదుర్గంలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న వన్నూరమ్మకు చెందిన 15వ స్టోరును సీఎస్‌డీటీ సుదర్శనాచారి, వీఆర్వోలు తనిఖీ చేశారు. కేవలం 30 రోజుల వ్యవధిలోనే వేర్వురుగా రెవెన్యూ అధికారులు, తూనికలు - కొలతల శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు వరుస తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అక్రమాలు జరగలేదని నిర్ధారించుకుని వెనుదిరిగారు. కాగా, వరుస తనిఖీలతో బెంబేలెత్తిన వన్నూరమ్మ బుధవారం ఏకంగా కన్నీరు పెట్టి బోరున విలపించింది. తాము ఎలాంటి అవినీతికి పాల్పడడం లేదని తెలిసి కూడా ఇతరులకు స్టోరు కట్టబెట్టేందుకు అధికారులు పనిగట్టుకుని తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ వాపోయింది. ఇలాగే వేధింపులు కొనసాగిస్తే తాను ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని విలపించింది.

డబ్బా తుకాలపై కన్నెత్తి చూడని అధికారులు :

టీడీపీ నేతలు, కార్యకర్తలు దక్కించుకున్న డిపోల్లో డబ్బా తుకాలతో బియ్యాన్ని కాజేస్తున్నా అధికారులు పల్లెత్తు మాట అనడం లేదు. తూకాల్లో డీలర్లు మోసం చేస్తున్నారంటూ పలువురు చేసిన ఫిర్యాదులు బుట్టదాఖలవుతున్నాయి తప్ప ఎలాంటి చర్యలూ లేవు. అంతేకాక ఇంటింటికీ రేషన్ పంపిణీని పూర్తిగా అటకెక్కించేశారు. దీంతో వయో వృద్ధులు, ఒంటరి మహిళలు సుదూరంగా ఉన్న చౌకధాన్యపు డిపోలకు వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూ సమస్యలకు మోక్షమేదీ..?

- చుక్కల భూములకు కానరాని ముక్తి
- అదేదారిలో మ్యుటేషన్ ఫైళ్లు
- కార్యాలయాల చుట్టూ ప్రజల పదక్షిణలు



అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ శాఖల పనితీరు ఒకడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. ప్రధానంగా ఫైళ్ల క్లియరెన్స్‌లో శాఖలన్నీ చాలా వెనుకబడ్డాయి. కీలకమైన రెవెన్యూ శాఖ పరిధిలో ఫైళ్ల ఆశించిన స్థాయిలో పరిష్కారం కావడం లేదనే విషయాన్ని అధికారిక నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. చుక్కల భూముల ఫైళ్లకు ముక్తి కల్పించడం లేదు. అదేదారిలో సర్వే నంబర్ కరెక్షన్, ఎల్‌పీ నంబరు కరెక్షన్ తదితర ఫైళ్లు ఉన్నాయి. ఇక.. ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పేరుతో 22ఏ ఫైళ్ల పరిష్కారం అటకెక్కించారు. దీంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విసిగిపోతున్నారు.

264 ఫైళ్లు పెండింగ్

చుక్కలు భూములకు సంబంధించి దాదాపు 264 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రతి వారం డీఎల్‌సీ (జిల్లాస్థాయి కమిటీ) సమావేశం నిర్వహించి చుక్కల భూముల (డాటెడ్ ల్యాండ్) ఫైళ్లు పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నా... ఆచరణలో అమలు కావడం లేదు. దాదాపు ఎనిమిది నెలలుగా కొన్ని ఫైళ్లు పరిష్కారం కాలేదు.

మ్యుటేషన్ ఫైళ్లదీ అదేదారి..

జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 31 మండలాల పరిధిలోనూ మ్యుటేషన్ ఫైళ్లు పరిష్కారం కావడం లేదు. సర్వే నంబరు కరెక్షన్‌కు సంబంధించి 12,759 ఫైళ్లు సిద్ధం చేశారు. వీఆర్‌ఓ, తహసీల్దారు, ఆర్‌డీఓల పరిశీలన అనంతరం ఉన్నతాధికారి 3,161 ఫైళ్లు డిస్పోజ్ చేశారు. మిగిలిన ఫైళ్లలో ఒక్క ఫైలు కూడా డిస్పోజ్ కేటగిరీలో అప్రూవల్ కాకపోవడం గమనార్హం. ఇక ఎల్‌పీ నంబర్ కరెక్షన్ కోసం 529 ఫైళ్లు సిద్ధం చేయగా.. డిస్పోజ్ కేటగిరీలో తహసీల్దారు 101 ఫైళ్లు తిరస్కరించగా, 6 ఫైళ్లు అప్రూవ్ చేశారు.

22ఏకు కానరాని మోక్షం..

నిషేధిత భూముల జాబితా (22ఏ)కు ఇప్పట్లో మోక్షం లభించే సూచనలు కనిపించడం లేదు. రైతులకు మంచి చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2003 కంటే ముందు అసైన్డ్ అయిన భూములకు యాజమాన్య హక్కులు కల్పించేలా చరిత్రాత్మక నిర్ణయం తీసుకుని అమలు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఫ్రీహోల్డ్ భూముల పరిశీలనకు ఆదేశించింది. ఈ ప్రక్రియను మార్చి 15 వరకు పొడిగించింది. దీంతో 22ఏ జాబితాలోని భూముల ఫైళ్ల పరిష్కార ప్రక్రియను అధికారులు చేపట్టడం లేదు.

కదిలింది.. బ్రహ్మరథం



తొండపాడులో వైభవంగా సాగుతున్న రంగనాథుడి రథోత్సవం



కళ్యాణదుర్గంలో పట్టాభిరామస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు దేవేరులతో కలసి బ్రహ్మరథంపై శ్రీవారు ఊరేగారు. స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఈఓ రామాంజనేయులు లాంఛనంగా రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం వేలాదిగా తరలి వచ్చిన భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని గ్రామ శివారులోని జమ్మి చెట్టు వరకూ లాగారు. అంతకు ముందు ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

కళ్యాణదుర్గం: స్థానిక పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటలకు కుంభపూజ, నిత్యహోమం, గ్రామ బలి, ఆస్థాన మంటప సేవ, తాలూకా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మడుగుతేరు ఉత్సవం అనంతరం బ్రహ్మరథోత్సవం నిర్వహించారు. స్థానిక బొడ్రాయి నుంచి గాంధీ చౌక్ వరకు రథాన్ని భక్తులు లాగారు. రథోత్సవాన్ని స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రారంభించారు. సాయంత్రం 4 గంటలకు ధూళోత్సవము, రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగాయి. రథోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'కానిస్టేబుల్ భర్త దౌర్జన్యాలు అరికట్టండి'

అనంతపురం/టవర్‌క్లాక్: మహిళా కానిస్టేబుల్ భర్త ఆగడాలను అరికట్టాలని బాధితురాలు వేడుకుంది. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను బాధితురాలు, అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన లక్ష్మీదేవి వెల్లడించారు. ఆడిట్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీదేవి భర్త కె.రమేష్‌బాబు 2023, నవంబర్ 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశాడు. నగరంలో కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం కోసం నగరంలోని శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న మహిళా కానిస్టేబుల్ (గార్లదిన్నె పీఎస్)తో లక్ష్మీదేవి రూ.లక్ష అప్పు చేశారు. అయితే సక్రమంగా కంతులు చెల్లిస్తున్నా... కానిస్టేబుల్ భర్త మల్లి తరచూ ఫోన్లు చేస్తూ నానా దుర్భాషలాడేవాడు. వడ్డీ వ్యాపారం చేస్తున్న తన భార్యకు చెల్లించాల్సిన రూ.లక్షకు గాను వడ్డీ, అసలు పోను రూ.27వేలు బకాయి ఉందని, రోజూ తన కోరిక తీరిస్తే రూ.400 చొప్పున చెల్లింపు చేసుకుంటూ వస్తానంటూ లైంగిక వేధింపులకు తెరలేపాడు. ఇందుకు సంబంధించిన ఆడియో సంభాషణ తన వద్ద ఉందని బాధితురాలు వివరించింది. ఎలాగైనా కానిస్టేబుల్ భర్త దౌర్జన్యాన్ని అరికట్టాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రతిని పాత్రికేయులకు విడుదల చేసింది.

బోసిపోతున్న సచివాలయాలు

కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

- సర్వేల పేరుతో సిబ్బందిని వేర్వేరు పనులకు కేటాయింపు
- ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న సచివాలయాలు
- సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు పరుగులు తీస్తున్న ప్రజలు





గొల్లపల్లి సచివాలయం, రాప్తాడు-2 గ్రామ సచివాలయాల్లో ఇద్దరు అధికారులు విధుల్లో ఉన్న దృశ్యం

రాప్తాడు: గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. సచివాలయాల్లో ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి సేవలు అందడం లేదు. గత ప్రభుత్వంలో సచివాలయాలకు మెయింటెనెన్స్ కింద ఇచ్చే గ్రాంట్‌ను నిలిపివేసింది. చాలా సచివాలయాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి కంప్యూటర్లు మూలనపడ్డాయి. సచివాలయ సిబ్బందిని కావాలనే వేరే పనులకు వాడుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రజలు, సచివాలయ సిబ్బందికి మధ్య వారధిలా పనిచేసే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఈ సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలకు అందించేవారు. దీంతో మండల కార్యాలయాలతో పనే లేకుండా చేశారు. అయితే గత ప్రభుత్వానికి పూర్తిగా భిన్నంగా వ్యవహరిస్తూ వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. సచివాలయ వ్యవస్థను కూడా రద్దు చేసే ప్రయత్నాలు చేస్తూ సచివాలయాల్లో సిబ్బందిని లేకుండా చేస్తున్నారు.

నియోజకవర్గంలో సుమారు 600 మంది ఉద్యోగులు

రాప్తాడు నియోజకవర్గంలో 60 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. రాప్తాడులో 13, చెన్నేకొత్తపల్లిలో 13, కనగానపల్లిలో 12, ఆత్మకూరులో 11, రామగిరిలో 11 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో దాదాపు 600 మంది సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో సచివాలయంలో పరిపాలన, విద్యా, సంక్షేమం, ప్లానింగ్, నీటి సరఫరా, మహిళా పోలీస్, పారిశుధ్యం, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం తదితర విభాగాలతో గ్రామ పరిపాలనా విభాగం పని చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. 2014–19 పరిపాలనలో పడిన అవస్థలను ప్రజలకు మళ్లీ పరిచయం చేస్తున్నారు. ప్రస్తుతం ఏ సర్టిఫికెట్ కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు దాపురించాయి. సచివాలయ వ్యవస్థను పట్టించుకోకుండా అందులో పని చేస్తున్న సిబ్బందిని వివిధ రకాలైన సర్వేలు పింఛన్ల పంపిణీకి ఉపయోగించడంతో సచివాలయాలు బోసిపోతున్నాయి. రేషన్ కార్డుల్లో పేర్ల మార్పు, తీసివేయడం, పొలం వన్‌బీ, అడంగల్, పొలాన్ని ఆన్‌లైన్ చేయడం, ఇతర ప్రధాన సేవల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ రోజులు తరబడి తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు.

అమలు కాని సంక్షేమ పథకాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 545 సేవలను ఆపేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎంఎస్ఎంఈపై రుణాల సర్వే, ఎన్‌పీసీఐ లింకేజీ ఆధార్‌తో బ్యాంక్ ఖాతాల లింక్, ఇంటింటా ఆరోగ్య సర్వే స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీ చేస్తున్నారు. ఆర్టీఎఫ్, ఎంటీఎఫ్, విద్యార్థులకు రుణాల సర్వే, పాఠశాల విజిట్, టాయ్‌లెట్ల ఫొటోల యాప్ లోడింగ్, సర్వేలతో పాటు ప్రతి నెలా సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నారు.

సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో?



భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అయినా పరిష్కారం కావడం లేదు. గతంలో సచివాలయాల్లో వీఆర్‌ఓ గ్రామంలో అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీఆర్‌ఓ మండల కేంద్రంలో కూర్చుంటున్నారు. అడంగల్, వన్‌బీ, పట్టాదారు పాసుపుస్తకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సచివాలయంలో పలకరించే నాథులు లేకుండా పోయారు. ప్రజలు సచివాలయాల దగ్గరకు చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పనులు కావడం లేదు. ఫలానా అధికారి కోసం వస్తే ఆ అధికారి సర్వేకు వెళ్లాడని ఇతర అధికారులు చెబుతున్నారు. సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తికమకపడుతున్నారు.

– రాజా రెడ్డి, రైతు, హంపాపురం

ఇబ్బందులు పడుతున్నాం..



గతంలో ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా గ్రామ స్థాయిలోనే పనులు పూర్తయ్యేవి. ప్రస్తుతం సచివాలయంలో పనులు జరగడంలేదు. పని జరగాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మా గ్రామం మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒక పని మీద మండల కేంద్రానికి వెళ్లాలంటే ఆ రోజు మొత్తం ఆ పని కోసమే కేటాయించాలి. పని జరగక పోతే మళ్లీ మరుసటి రోజు రావాలి. గత ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించి గ్రామ స్వరాజ్యాన్ని చూపించింది. ఇప్పుడెమో వలంటీర్ వ్యవస్థను లేకుండా చేసే సచివాలయ సిబ్బందిని ఇతర పనులకు వాడుకుంటున్నారు. బాధితులు ఏదైనా పనుల నిమిత్తం వస్తే కనీసం పలికే వారు లేకుండా పోయారు. గతంలో ఏదైనా పని ఉంటే వలంటీర్‌కు చెబితే చాలు.. అన్నీ వారే చూసుకుని పని చేసి పెట్టే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి

– ఆదినారాయణ, గొల్లపల్లి, రాప్తాడు మండలం

క్లుప్తంగా

నేత్రపర్వంగా ఐశ్వర్యేశ్వర వ్రతం



వ్రతం జరిపిస్తున్న బసవరాజ స్వామి

అనంతపురం కల్చరల్: మాఘమాసంలో వచ్చిన పౌర్ణమి రాకతో ఆలయాల్లో సందడి నెలకొంది. హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి ఆలయంలో సామూహిక ఐశ్వర్యేశ్వర వ్రతాలు ఘనంగా జరిగాయి. మఠం బసవరాజ స్వామి, విజయ్ కుమార్ వేద మంత్రాలతో వ్రతాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి కథలు, ప్రాధాన్యతను వినిపించారు. అంతకు ముందు ఆలయంలో మంజునాథ, అన్నపూర్ణేశ్వరి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వ్రతాల్లో పాల్గొని తీర్థప్రసాదాలందుకున్నారు. అశోక్ నగర్‌లోని రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయం, మూడవ రోడ్డులోని షిరిడీ సాయిబాబా మందిరం తదితర చోట్ల సామూహిక సత్యదేవుడి వ్రతాలు జరిగాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

అనంతపురం ఎడ్యుకేషన్: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ సూచించారు. బుధవారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు ఫోన్ నంబర్లు, ఖాతా నంబర్లు ఓటీపీ నంబర్లు చెప్పొద్దని సూచించారు. వృద్ధులు, మహిళలను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. రకరకాల పేర్లతో ఏమార్చి ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రుషేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ ప్రసాద్, ఏఓ శ్రీనాథ్, జాతీయ సేవా పథకం పీఓలు జి.ఆనంద్ బాబు, ఎస్.పురుషోత్తం, అధ్యాపకులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లో మినీ కాన్ఫరెన్స్‌హాల్లో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీడీఏ మద్దిలేటి, యూనియన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వాసు ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, కార్యదర్శి వెంకటకుమార్, కోశాధికారి శ్యాంసుందర్‌రెడ్డి, చిన్నమ్మ, రాకేష్‌నాయక్, సోమశేఖర్, పెన్నయ్య, యల్లప్ప, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా సర్వే పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లలితాబాయి

ఆత్మకూరు: మండలంలో జరుగుతున్న ఇంటింటా సర్వేను ఈనెల 14వ తేదీలోపు పూర్తి చేయాలని డీఎల్‌డీఓ లలితాబాయి అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఆత్మకూరు, సనప, మదిగుబ్బ, బి.యాలేరు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా సర్వేలో భాగంగా మిస్సింగ్ సిటిజన్, మొదలగు సర్వేలను పరిశీలించారు. ఎవరైతే సర్వే చేయించుకోని వారికి ప్రభుత్వ పథకాలు అందవని గుర్తు చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఈఓఆర్డీ కామక్క, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని 214 మంది రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన డ్రిప్, స్ప్రింక్లర్లతో పాటు 129 మంది రైతులకు పెరటి కోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో నీటి వనరులు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రిప్పు, స్ప్రింకర్లను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, హార్టికల్చర్ అధికారి రత్నకుమార్, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మీ, సర్పంచు సాకే తిరుపాలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి ఎన్‌ఎస్‌యూఐ నాయకులు



ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: ఎన్ఎస్‌సీయూ విద్యార్థులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి నాయకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పటిష్టతకు పని చేయాలని సూచించారు. విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని.. దానిపై పోరాడేందుకు విద్యార్థులు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండ్ల పల్లి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీలోకి చేరిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ నగరాధ్యక్షుడు నిషాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ ఏర్పాటుకు చర్యలు



డ్రైవర్స్ కాలనీలో ఉన్న ముస్లిం శ్మశాన వాటికను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: డ్రైవర్స్ కాలనీలో ఉన్న ముస్లింల శ్మశాన వాటికకు రూ.60 లక్షలతో ప్రహరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం ఆ శ్మశాన వాటికలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షబ్ ఏ బరాత్‌కు సంబంధించి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు శ్మశాన వాటికకు వస్తారన్నారు. వారికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు వెల్లడించారు. ప్రహరీ ఏర్పాటుకు టెండర్లు పూర్తయినట్లు వెల్లడించారు. అలాగే అశోక్‌నగర్, హెచ్ఎల్‌సీ కాలనీలోని ముస్లింల శ్మశాన వాటికల్లో ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.42 లక్షలతో హిందూ శ్మశాన వాటికలో పనులు చేపట్టడానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు అలీషేక్ ఇసాక్, రహంతుల్లా, సైపుల్లాబేగ్, కో–ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదా ఖలందర్, దాదు, రవీంద్రా రెడ్డి, మహబూబ్ బాషా, జిలాన్, అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు 'అమ్మ' చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఇద్దరు అనాథ చిన్నారులకు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలానికి చెందిన శ్రీజ, స్వాతి శ్రీమాతృశ్రీ అనాథశ్రమంలో ఆశ్రయం పొందుతున్నారు. ఆశ్రమాన్ని నడుపుతున్న నిర్వాహకురాలు అరుణమ్మ చిన్నారులకు సాయం అందించాలని కోరారు. స్పందించిన అమ్మ సంస్థ రమణారెడ్డి బుధవారం తన కార్యాలయంలో పిల్లలిద్దరి నూతన వస్త్రాలకు రూ.30 వేలు, నిత్యావసర వస్తువులకు మరో రూ.20 వేలతో పాటూ పుస్తకాలు, స్కూల్ ఫీజు చెల్లించడానికి రూ.20 వేలు అందించారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ.. పిల్లలిద్దరికి భవిష్యత్తులోనూ అండగా నిలుస్తానని భరోసా కల్పించారు.

సంక్షిప్త సమాచారం

ఆర్టీఏలో వాహనాల వేలం

అనంతపురం సెంట్రల్: రవాణా శాఖలో క్రైమ్ కేసులు లేని 67 వాహనాలకు బుధవారం తుక్కు కింద వేలం నిర్వహించారు. ఉప రవాణా కమిషనర్ ఎం. వీర్రాజు సమక్షంలో జరిగిన వేలంలో అనంతపురం, ప్రొద్దుటూరు, గుంటూరు ప్రాంతాల నుంచి వేలం పాటదారులు పాల్గొన్నారు. మొత్తం 67 వాహనాలకు జీఎస్టీతో కలిపి రూ.4.34 లక్షల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్ నాయుడు, ఎంవీఐ సునీత, ఏఓలు కామరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా నాగప్ప

అనంతపురం అర్బన్: రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సి.నాగప్ప ఎన్నికైనట్లు ఆ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న జరిగిన సమాఖ్య జిల్లా సమితి సమావేశంలో అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

28న ఉమర్ అలీషా జయంతి

అనంతపురం అగ్రికల్చర్: ఈనెల 28న అనంతపురం జిల్లా వేదికగా జరిగే డాక్టర్ ఉమర్ అలీషా జయంతి వేడుకలు జయప్రదం చేయాలని టౌన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్ తెలిపారు. బుధవారం టౌన్‌బ్యాంకు కార్యాలయంలో జయంతి పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉమర్ అలీషా సాహితీ సమితి ప్రతినిధులు సుంకర రమేష్, విజయసాయి కుమార్, తోట నాగరాజు, సునీల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు

అనంతపురం ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ 2025లో సత్తా చాటిన స్థానిక అశోక్ నగర్‌లోని మినర్వా పాఠశాల విద్యార్థి మహమ్మద్ ఆసిఫ్‌ను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జి.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ స్కూల్‌లో 10వ తరగతి వరకు చదువుకున్న మహమ్మద్ ఆసీఫ్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.48 పర్సంటైల్ సాధించాడన్నారు. ఆసిఫ్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

భరతమునికి నృత్య నీరాజనం

అనంతపురం కల్చరల్: స్థానిక కమలానగర్‌లోని శ్రీనృత్యకళా నిలయం ప్రాంగణంలో బుధవారం భరతముని జయంతి నిర్వహించారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి నేతృత్వంలో పలువురు చిన్నారులు, కళాకారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి కార్యదర్శి లక్ష్మి, ఆచార్య సుధాకరబాబు, శ్రీనిధి రఘు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌కు గాయాలు

అనంతపురం: నగరంలో శ్రీకంఠం సర్కిల్ నుంచి పాతూరు వైపునకు వెళ్తున్న బైక్‌ను ఆటో ఢీ కొట్టింది. ఈ నేపథ్యంలో అదే సర్కిల్‌లో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్న కానిస్టేబుల్ వీరాంజనేయులు, మరో వ్యక్తి రాఘవేంద్ర రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని ప్రభుత్వ సర్వజనాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నరసింహమూర్తి సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: స్థానిక లలిత కళాపరిషత్తులో బుధవారం నరసింహమూర్తి 6వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్కేపీ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది పద్మజ, ఉపాధ్యక్షులు సంగాల నారాయణస్వామి, సీపీఎం రాష్ట్ర నాయకులు రామభూపాల్ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో టీసీఎస్ శిక్షణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురానికి చెందిన విద్యార్థులకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద టీసీఎస్ కంపెనీ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ట్రైనింగ్ ప్రోగ్రాం ఇవ్వనున్నారు. టీసీఎస్ స్టేట్ ఇంపాక్ట్ లీడర్ ఫర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ శ్రీనివాసన్ విశ్వనాథ్ , జేఎన్‌టీయూ అనంతపురం ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్యలను కలిశారు. జేఎన్‌టీయూ పులివెందుల, జేఎన్‌టీయూ కలికిరి ఇంజినీరింగ్ కళాశాలలో ఇది వరకే టీసీఎస్ శిక్షణ ఇస్తోందన్నారు. ఇదే తరహాలోనే జేఎన్‌టీయూ అనంతపురం క్యాంపస్ కళాశాలలో శిక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ఆడిట్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సవీరలో అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం మెడికల్: కిమ్స్ సవీర ఆస్పత్రిలో గుండె వైద్య నిపుణులు ఓ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రజాక్, అజ్మీర్ అనే ఇద్దరు వ్యక్తులకు గుండెలో బ్లడ్ బ్లాక్స్ ఏర్పడ్డాయి. దీంతో ఆస్పత్రిలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ జి.ప్రదీప్‌కృష్ణ పెంబ్రా కాట్ ఆర్ఎక్స్ అనే సరికొత్త, అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చికిత్స చేసి రోగులకు ప్రాణం పోశారు. బ్లడ్ బ్లాక్స్ తొలగించిన తర్వాత స్టెంట్ వేయాల్సిన అవసరం రాలేదని డాక్టర్ ప్రదీప్‌కృష్ణ తెలిపారు. ఇలాంటి చికిత్సలు చేయడం రాయలసీమలోనే తొలిసారి అని వెల్లడించారు. సాధారణంగా పెద్ద నగరాల్లోని ఆస్పత్రుల్లోనే ఇటువంటి అత్యాధునిక సౌలభ్యం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలో ఇలాంటి సదుపాయం ఉండటం శుభపరిణామమన్నారు.

ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఆత్మహత్య

అనంతపురం: కమలానగర్‌లో ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్న చంద్రశేఖర్ (50) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రింటింగ్ ప్రెస్ నిర్వహణకు అప్పులు కూడా చేశారు. బుధవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. చంద్రశేఖర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ కేసు నమోదు చేశారు.

సమావేశాలు పాత పద్ధతిలోనే నిర్వహించాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు పాతపద్ధతిలోనే నిర్వహించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి మాట్లాడుతూ.. అర్ధరోజు సమావేశాలు ఏర్పాటు చేయడం వల్ల అన్ని అంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవడానికి సమయం సరిపోదన్నారు. టీస్' వివరాలు సరి చేసే క్రమంలో ప్రధానోపాధ్యాయులను ఇబ్బందులు పెట్టకూడదని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.రామాంజనేయులు, నాయకులు సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్యాచారి, నాగభూషణ, కిషోర్, సురేష్, కృష్ణమోహన్, ఫణిభూషన్, రాజశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని మార్పు చేయాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగిరెడ్డి, శ్రీధర్‌గౌడ్ ఓ ప్రకటనలో కోరారు. సమావేశాల నిర్వహణపై ఉన్నతాధికారులు పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల వేళల్లో మార్పు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి గొని పాతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం 11:45 నిమిషాల వరకు పని చేస్తున్న పాఠశాలలో తరగతులు నిర్వహించి.. తర్వాత 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్లస్టర్ పాఠశాలలకు గంటలో చేరుకోవడం సాధ్యమేనా? అని ప్రశ్నించారు.
- స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఒకేరోజు నిర్వహించాలనే నిర్ణయాన్ని మార్చుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, జిల్లా నాయకులు చిదంబరరెడ్డి, బాల రామ్మోహన్, సూర్యనారాయణ, ఈశ్వరయ్య, తిప్పేస్వామి, మహేష్, రంగనాయకులు, శ్యామ్ శంకర్, జాకబ్, సుహేల్, మన్సూర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రామోత్సవం



రథంలో ఊరేగుతున్న ఉమా నీలకంఠేశ్వర స్వామి



గ్రామోత్సవంలో పాల్గొన్న శివమాలధారులు

రాప్తాడు: మండల కేంద్రంలో మాఘమాస పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఉమా నీలకంఠేశ్వర స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. గురుస్వాములు చిత్రా నాగేంద్ర, గొరవ శివయ్య, తలారి శివ నేతృత్వంలో ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా నీలకంఠేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలకరించి రథంపై కొలువుదీర్చారు. ఆలయం వద్ద నుంచి బ్యాండు మేళాలు, భక్తుల జయ జయధ్వానాల మధ్య స్వామి రథాన్ని ఆలయ మాఢవీధులతో పాటు సమీప కూడళ్లలో ఊరేగించారు. మహిళలు, బాలికలు స్వామి రథం ముందు కలశాలు పట్టారు. అనంతరం శివాలయం వద్ద తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. అలాగే మండలంలోని ఆలయాలు ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడాయి.

తేరు.. జనహోరు



సూర్యప్రభ వాహనంపై కొండమీద రాయుడు

బుక్కరాయసముద్రం: కొండమీదరాయుని తిరునాల సందర్భంగా మండల కేంద్రం భక్తులతో సందడిగా మారింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు రథోత్సవాన్ని తిలకించి పరవశించిపోయారు. రథం ముందు కొబ్బరి కాయలు, గుమ్మడి కాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తినుబండారాలు, బొమ్మలు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.



స్వామికి మొక్కుతున్న భక్తులు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



జంపింగ్ నెట్‌లో చిన్నారుల సందడి



కొండమీద రాయుడి రథం ముందు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు